విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 10, ఏప్రిల్ 2025

బియ్యం గోడౌన్ తనిఖీ..

విశాలాంధ్ర-తాడిపత్రి: పెద్ద పప్పూరు రోడ్డు, చిన్నపడమల గ్రామ సమీపంలో ఉన్న (ఎంఎల్ఎస్ పాయింట్) బియ్యం గోడౌన్ నులో పిడిఎస్ బియ్యం, అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేసే ఆయిల్, నిత్యావసర సరుకును బుధవారం గుంతకల్ ఆర్డీవో శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో బియ్యం గోడౌన్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. విశాలాంధ్ర ఆర్డిఓ శ్రీనివాసులుకు ఫోన్ చేసి వివరణ కోరగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. అలాగే తాసిల్దార్ రజాక్ వలి, సిఎస్డిటి మారుతి ప్రసాద్ రెడ్డిని వివరణ కోరగా గోడౌన్‌లో అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేసే ఆయిల్‌లో అవకతవకలు జరిగినట్లు చెప్పారు. ఈ అవకతవకలపై ఆర్డీవో శ్రీనివాసులు పై అధికారులకు తెలియజేసి, స్టాకిస్ట్ శంకరయ్య పై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రజాక్ వలి గుంతకల్ ఏఎస్ఓ రాము సిఎస్డిటి మారుతి ప్రసాద్ రెడ్డి బియ్యం గోడౌన్ స్టాటిస్ట్ శంకరయ్య బియ్యం గోడౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

టిబిని నియంత్రిద్దాం..

విశాలాంధ్ర, అనంతపురం : జిల్లా క్షయ వ్యాధి నివారణ కార్యాలయంలో డా.అనుపమ జేమ్స్, డబ్ల్యు హెచ్ఓ ప్రతినిధి డా. జి.ఎస్. ప్రశాంత్ జిల్లాలో క్షయ వ్యాధి నివారణ కార్యక్రమం పైన బుధవారం నెలవారి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో 11 టీబీ యూనిట్స్‌కి సంబంధించిన సూపర్‌వైజర్ ఉద్యోగులు పాల్గొన్నారు. టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై వివరించారు. జిల్లా క్షయ నివారణ అధికారి సిబ్బంది పాల్గొన్నారు

మార్క్ శంకర్ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలి

విశాలాంధ్ర-శింగనమల : సింగపూర్‌లో తాను చదువుతున్న స్కూల్లో అగ్ని ప్రమాదం సంభవించి గాయాల పాలైన ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ మార్క్ శంకర్ పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ బుధశారం శివాలయంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు తోట ఓబులేసు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు, అభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదం జరిగినటువంటి స్కూల్లో గాయపడిన పిల్లలందరూ కూడా త్వరగా కోలుకోవాలని సంపూర్ణ ఆరోగ్యంతో బయటకు రావాలని దేవుని ప్రార్థించానన్నారు. జనసేన పార్టీ యువ నాయకులు తోటరామమోహన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర-రాప్తాడు : గర్భిణులు ప్రతిరోజు నాణ్యమైన పోషకాహారం తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ శివకృష్ణ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం రాప్తాడు పి.హెచ్.సిలో నిర్వహించారు. సుమారు 60 మంది గర్భవతులకు బి.పి, షుగర్, హెచ్.బి, యూరిన్ తదితర ప్రత్యేక పరీక్షలు చేశారు. క్రమం తప్పకుండా నెలసరి పరీక్షలు, పోషకాహారం, ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. ఇరానీచాయ్ సిద్దప్ప, మహబూబ్ బాషా, మహబూబ్ బీలు గర్భవతులకు భోజన వసతి కల్పించారు. సూపర్వైజర్లు నరసింహ, అరుణ ల్యాబ్ టెక్నిషియన్ శ్రీధర్ బాబు, ఎం.ఎల్.హెచ్.పిలు, ఎం.పి.హెచ్.ఎలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామిని దర్శించుకున్న పురావస్తు శాఖ అధికారులు

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రజిత, టెక్నికల్ అసిస్టెంట్ మహేంద్ర నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసులు బుధవారం సందర్శించారు. రజిత మాట్లాడుతూ పురాతన దేవాలయ వైశిష్ట్యాన్ని అర్చకులు హరినాథ శర్మ చక్కగా వివరించారు. ఆలయంలో పడమర వైపు ఉన్న శిథిలావస్థకు చేరిన పురాతన సత్రాన్ని తొలగించి నూతన మంటపాన్ని నిర్మించేటట్లు చూడాలని రజితను ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని రజిత తెలిపారు. త్వరలో జిల్లా కలెక్టర్‌ను యాడికి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని సందర్శించేటట్లు చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మాజీ సర్పంచ్ గోపాల నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

22 వరకు పోషణ పక్వాడా

విశాలాంధ్ర-.డి.హిరేహాల్ : మండలం మండలంలోని కల్యం గ్రామంలో మంగళవారం ప్రతి అంగన్వాడీ సెంటర్లో ఈ నెల 8వ తేదీ నుంచి 22 వ తేదీ వరకు ప్రతిరోజు పోషణ పక్వాడ ప్రొగ్రాం జరుగనుందని సిడిపిఓ పద్మావతి వివరించారు. మొదటి 1000 రోజుల గర్భ దశ నుండి 2 సంవత్సరాల వరకు సంరక్షణపై శ్రద్ధ వహించుట..పిల్లలలో పోషకా హార లోపం నివారణ వల్ల పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గంచడానికి ఆరోగ్యకరమైన జీవన శైలిపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు నాగరత్న ఈశ్వరమ్మ అంజినమ్మ జ్యోతి లక్ష్మీ దివ్య అంగన్వాడి టీచర్లు అలివేలమ్మ గోవిందమ్మ పుష్పావతి ఆశ పాల్గొన్నారు

పొగాకును నియంత్రిద్దాం ..

విశాలాంధ్ర-అనంతపురం : జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలను పొగాకు రహిత ప్రాంతంగా మార్చడానికి ప్రతిఒక్కరూ చేతులు కలపాలని అనంతపురం మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.విష్ణుమూర్తి ఆధ్వర్యంలో పొగాకు నియంత్రణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నెలకు రెండు సార్లు ఎన్‌ఫోర్సుమెంట్ డ్రైవ్ నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారికీ అవగాహన కల్పించి 200 రూపాయలు జరిమానా విధించాలని తెలియజేశారు,, జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ బోయ. శ్రీరాములు మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయ చుట్టూ పక్కల, పొగాకు సంబంధించిన దుకాణాలను, కార్యాలయ ఆవరణలో బీడీలు సిగరెట్లు గుట్కా, పాన్ పరాగ్, కైని జర్దా నిషేధించామన్నారు. కొటేప యాక్ట్-2003 చట్టం ప్రకారం, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ.200లు జరిమానా విధిస్తారన్నారు. 18 ఏళ్లలోపు పిల్లల చేత సిగరెట్, పొగాకు ఉత్పత్తులు, అమ్మరాదు వారిచేత అందించరాదన్నారు. పొగాకు నియంత్రణ కార్యక్రమ సామాజిక కార్యకర్త శ్రీరాములు సూపరిండెండెంట్ సుజాత పాల్గొన్నారు.

కూడేరు ఏపీవోగా పోలేరయ్య

విశాలాంధ్ర-కూడేరు : మండలంలోని ఉపాధి హామీ ఏపీవోగా పోలేరయ్య బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో బుక్కరాయ సముద్రం మండలంలో ఏపీఓగా విధులు నిర్వహించేవారు, ఇక్కడి ఏపీవో తులసి ప్రసాద్ ఉరవకొండ మండలానికి బదిలీ అయ్యారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-బెళుగుప్ప : మండలంలోని బుదివర్తి గ్రామానికి చెందిన ఆంజనేయులు(72) భీమప్ప అనే వ్యక్తి మొలలు వ్యాధితో బాధపడుతూ ఎక్కడ చూపించిన నయం కాకపోవడంతో మద్యానికి బానిసై ఉరి చివరన ఉన్న చింతచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కొడుకు హనుమంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శివ కేసు నమోదు చేశాడు.

రైల్వే డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి

రైల్వే డీఆర్ఎంకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వినతి

విశాలాంధ్ర.. గుంతకల్ : స్థానిక రైల్వే డివిజనల్ ఆఫీసులో కమిటీ ఆధ్వర్యంలో గుంతకల్ రైల్వే డివిజన్లో ఉన్న సమస్యలపై చర్చించారు. ముఖ్యఅతిథిగా గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ భూమి రెడ్డి రామగోపాల్ రెడ్డి హాజరై వారు మాట్లాడుతూ ధర్మవరం గేట్, బళ్లారి గేట్, కసాపురం బ్రిడ్జిలు గుంతకల్ పట్టణంలో జనాభా ఎక్కువగా ఉండి ట్రాఫిక్‌కు చాలా అంతరాయం కలుగుతుందని గుంతకల్‌ను అభివృద్ధి చేయడానికి రైల్వే డిఆర్ఎమ్‌కు విన్నవించారు. చిన్నచిన్న స్టేషన్లో మరుగుదొడ్లు, బాత్రూంలో శానిటైజింగ్ చేసి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం అభివృద్ధి కోసం రైల్వే పరిధిలో ఉన్న ముద్దనూరు -ముదిగుబ్బ రైల్వే లైన్ 60 కిలోమీటర్ల దూరంలో ఉంది వాటికి అనుమతి ఇస్తే అక్కడ నంద్యాల, కడప పారిశ్రామిక వేతలకు, రైతులకు అనుకూలంగా ఉంటుంది అలాగే కర్ణాటకకు ఎగుమతులు చేయడానికి ఉపయోగకరంగా ఉంటుందని అందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. గతంలోలా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు రిజర్వేషన్ కౌంటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవా లని చెప్పామన్నారు. రద్దు అయిన హుబ్లీ తిరుపతి అలాగే గుంతకల్ విజయవాడ రైలు పునరుద్ధరిస్తే తిరుపతికి గాని విజయవాడకు పోవడానికి ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గుంతకల్ డివిజన్లో రద్దయిన రైలును పునరుద్ధరించాలని కోరగా డిఆర్ఎం మాట్లాడుతూ ఈ విషయా లపై రైల్వే బోర్డుకు పంపుతామని తెలిపారు. డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు హిమబిందు, కూటమి నాయకులు, సీనియర్ డిపిఓ మనోజ్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరక్షించండి..

విశాలాంధ్ర-నార్పల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడాలని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేశవ రెడ్డి, గిరిజన సమైక్య రాష్ట్ర కార్యదర్శి వై యల్ రామాంజనేయులు అన్నారు. బుదవారం రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఉపాధి కూలీకి రోజుకి రూ.700 కూలి చెల్లించి 200 రోజులు పనిదినాలు కల్పించాలని, ఉపాధి భృతిగా ప్రతి కూలీకి ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని, ఏప్రిల్ 21.22, తేదీల్లో బండ్లపల్లి నుండి అనంతపురం వరకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బికేయమ్‌యూ) ఆధ్వర్యాన కష్టజీవుల పాదయాత్ర ఉంటుందన్నారు. 2005లో వామపక్ష పార్టీల మద్దతుతో వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు దీర్ఘకాలిక ఆందోళనా పోరాటాల ఫలితంగా గ్రామీణ పేదకష్ట జీవులు పనులు లేక వలసలు, ఆకలిచావులు నివారించేందుకు 100 రోజులు పనులు గ్యారంటీ కల్పించే లక్ష్యంతో పార్లమెంట్‌లో మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం చేయబడి పథకంగా రూపొందించబడిందన్నారు. 2006, ఫిబ్రవరి 2వ తేదీన బండ్లపల్లి గ్రామంలో అప్పటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ, స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించి అమలులోకి తెచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టానికి బడ్జెట్‌లో 4 లక్షల 60 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా ఏటా తగ్గిస్తూ కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. పనులు లే ఏటా వలసలు పెరుగుతున్నా నివారణకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ సంవత్సరం బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఈ చర్యలకు నిరసనగా 21.22 తేదీల్లో నార్పల మండలం బండ్లపల్లి గ్రామం నుండి అనంతపురం వరకు బికేయంయు ఆధ్వర్యంలో గ్రామీణ కష్ట జీవులు డిమాండ్ల సాధన కోసం జరిగే పాదయాత్రకు వ్యకాసం రాష్ట్ర నాయకత్వం పాల్గొంటున్నది. రెండవ రోజు అనంతపురం టవర్ క్లాక్ దగ్గర గాంధీ విగ్రహం వద్ద సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ ఇతర రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించామని మీ వంతు తోడ్పాటు అందించాలని కోరారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి పయ్యావుల కేశవ్

విశాలాంధ్ర-బెళుగుప్ప : మండల కేంద్రంలో బుధవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావు కేశవ్ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని, బిపిహెచ్‌ని, సిసిరోడ్డును, గుండ్లపల్లి రోడ్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.75 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని, అక్కడే 50 లక్షల రూపాయలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బిపిహెచ్)ను కలెక్టర్ వినోద్‌కుమార్.వితో కలిసి ప్రారంభించారు. తదనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు.

అనంతరం ఎస్.సి కాలనీలో రూ.16.71 లక్షల రూపాయలతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన సిసి రోడ్డును మంత్రి, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్.సి కాలనీ మహిళలు పూలు చెల్లుతూ మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆవులన్న గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు, థాంక్యూ మినిస్టర్ సార్ అంటూ ఫ్లకార్డులు ప్రదర్శించారు ఎంపిపి పెద్దన్న, ఎస్ఈ రాజగోపాల్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిఈ బాల కాటమయ్య, మెడికల్ అధికారులు డా.కార్తీక్‌కుమార్ రెడ్డి, డా.ప్రియాంక పాల్గొన్నారు.

పలుచోట్ల పందుల మృతి

విశాలాంధ్ర-పామిడి : పట్టణంలో పందులు స్వైరం విహారం చేస్తున్న ప్రజలు ఎంతో ఓర్చుకున్నారు. ఇటీవల పందులకు వైరస్ రావడంతో ప్రతిరోజు పలు ప్రాంతాలలో మృతి చెందుతున్నాయని, సంబంధిత అధికారికి సమాచారం అందించిన వాటికి తీసివేయడానికి రెండు మూడు రోజులు పడుతుందని చెబుతున్నారని.. దీంతో మృత కళేబరాల దుర్గంధం తాలలేకున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ బ్యాంక్ ప్రాంతంలోని ప్రధాన రహదారి ప్రక్కనగల టెలిఫోన్ టవర్స్ దగ్గర రోజుకు ఒక పంది చెప్పులు వరుసగా నాలుగు రోజులు పాటు చనిపోయాయని వాటిని తీసి వేయడానికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా, సమాచారం అందించిన అధికారుల స్పందన కరువైందని ఆకాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలకు మెదడు వాపు రాకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు సేవలు మరువలేనివి

విశాలాంధ్ర గుంతకల్: ప్రజా శ్రేయస్సు కోసం ప్రజాపోరాటం చేసి భారత కమ్యూనిస్టు పార్టీ యోధుడిగా కామ్రేడ్ చంద్రా రాజేశ్వరరావు నిలిచారని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గోవిందు కొనియాడారు. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 31 వ వర్ధంతి సందర్భంగా ఆయన ఫోటోకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతర సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ బి.గోవింద్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం వీరభద్ర స్వామి, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బి మహేష్, రూరల్ కార్యదర్శి రాము రాయల్ మాట్లాడుతూ కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పదవుల కోసం ఆశించకుండా ప్రజా శ్రేయస్సు కోసం పోరాటం చేసిన మహానేత అన్నారు. డాక్టర్ వృత్తిని సైతం విడిచిపెట్టి కమ్యూనిస్టు భావజాలాలని ప్రజలలో తీసుకెళ్లే విధంగా ప్రజా సమస్యలపై పోరాటాలను కొనసాగించారని, తనకున్న 400 ఎకరాలు పొలాన్ని సైతం పేద ప్రజలకు పంచిపెట్టి చల్లపల్లి రాజా 400 అకాల భూమిని పోరాడి పేద ప్రజల పరం చేశారని గుర్తు చేసుకున్నారు. సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, స్వాతంత్ర్య సమరయోధులు ,విజయవాడ రౌడీలా గుండెల్లో జనసేవాదళ్ స్థాపించి రైళ్లు పరిగి అతించిన స్ఫూర్తి ప్రదాత,కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత,మహా మనిషి, యావత్ ఆస్తిని పేదలకు పంచిన త్యాగశీలి, ధనిక పేద తేడాల్లేని సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా జీవితాంతం కృషి చేసిన ఆదర్శమూర్తి కామ్రేడ్ చంద్రబిరాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా ఆయన ఆశలని నెరవేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌసు మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య ప్రజానాట్య మండలి అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, పుల్లయ్య, సిపిఐ నాయకులు నూర్ మహమ్మద్, ఉమర్ భాష, దాసరి శ్రీనివాసులు, నందు, వలి ,భాష, మధు బాబు, నాగార్జున, ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు రోహిత్ సిపిఐ నాయకులు చిదాంబరం గడ్డం భాష, గురు స్వామి, ధోనిముక్కల శాఖ కార్యదర్శి గురుస్వామి, జి.కొట్టాల శాఖ కార్యదర్శి ఆటో సూరి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర-గుంతకల్లు : పట్టణంలోని 3వ వార్డు సంతోష్‌నగర్ ఆర్డిటి కాలనీలో తాగునీరు, మురుగు కాలువలు వీధిలైట్లు సమస్యలపై గుంతకల్ కమిషనర్‌కి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో మునిసిపల్ మేనేజర్‌కువినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్.గోపీనాథ్ రూరల్ కార్యదర్శి రాము రాయల్ పకీరప్ప కాలనీవాసి దేవేంద్ర మాట్లాడుతూ.. గుంతకల 3వ వార్డు సంతోష్ నగర్ చివరి భాగంలో ఉండే ఆర్డిటి కాలనీకి తాగునీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే వంతెన నుంచి వెళ్లడానికి రోడ్డు, వీధి దీపాలు లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యం వస్తే చూపించుకోవడానికి హెల్త్ సెంటర్ లేదు.. చిన్నపిల్లలు చదువుకోవడానికి అంగనవాడి కేంద్రం లేదు ఒకసారి వెనక్కి వెళ్లి చూస్తే రాజేంద్రనగర్ నగర్ రైల్వే బ్రిడ్జిలో గత 40 ఏళ్ల క్రితం మూడు ఇంచుల మంచినీటి పైపులైను వేశారు.. ఈరోజు సంతోష్‌నగర్ ద్వారకా నగర్ ఆర్డిటి కాలనీకి(ములకలపెంట)తోలు ఫ్యాక్టరీ వెనకాల బాగాన నాలుగు కాలనీలు ఏర్పడినాయి. తాగునీటికి చాలా ఇబ్బందికరంగా ఉంది.. తోలు ఫ్యాక్టరీ మూతపడడంతో మూడు ఇంచుల పైప్ లైన్ వృధాగా పడి ఉంది పై నాలుగు కాలనీలకు ఈ పైప్లైన్ లింకు చేస్తే నీటి సమస్య తీరుతుందన్నారు. రోడ్లు ఇరువైపులా వీధిలైట్లు కాలనీలో మురికి కాలువలు ఏర్పాటు చేయాలని, ఆర్‌డీటీ కాలనీలో నిరుపయోగంగా ఉన్న సిమెంట్ వాటర్ ట్యాంకును ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని కోరారు. సిపిఐ శాఖా కార్యదర్శులు..నూర్ భాషా దాసరి శ్రీనివాసులు మధుబాబు. లంబానూరు సంతోష్ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

విశాలాంధ్ర అనంతపురం క్రైం: ఈనెల 26, 27, 28 తేదీలలో కడప నగరంలో నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం కరపత్రాలను అనంతపురం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మ శ్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతరాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల పై విద్యార్థులను సైదాంతికంగా తయారు చేసేందుకు ఈ రాజకీయ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేస్తుందనీ ఆవేదన వ్యక్తం చేశారు. 10 నెలలు కాలం గడుస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని మండి పడ్డారు. అధికారంలోకి వస్తే ప్రతి బిడ్డకు 15వేల రూపాయలు ఇస్తామని తెలిపిన ఎన్డీఏ నేతలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇస్తామనీ అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ వెంకట్ నాయక్, నరసింహ యాదవ్ ,చందు నగర అధ్యక్షులు మంజునాథ్ నగర సహాయ కార్యదర్శి సమీర్ మహేష్ నాయక్ ,ప్రసాద్ వెంకటేష్ కిరణ్ కీర్తన పూజ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సొమ్ము జమ చేయాలి

విశాలాంధ్ర, అనంతపురం క్రైం: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు బకాయి ఉన్న రూ.48 లక్షల సొమ్మును వెంటనే కార్మికుల ఖాతాల్లోకి జమ చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్ డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని 309 మంది ఇంజనీరింగ్ కార్మికులకు 2011 సం,,లో బకాయి ఉన్న 9 నెలల సొమ్మును కార్మికుల ఖాతాల్లో జమ చేయించాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. 14 ఏళ్లుగా ఎన్ని ఉద్యమాలు చేసినా కల్లబొల్లి మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఎందరు కమిషన్లు మారినా ఈపిఎఫ్ సమస్య మాత్రం పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, యూనియన్ జిల్లా కోశాధికారి వేణుగోపాల్, పాల్గొన్నారు.

12 నుండి సంగమేశ్వర స్వామి ఉత్సవాలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: కర్ణాటక సరిహద్దు సింగిపల్లి గ్రామ సమీపంలోని వేదవతి చిన్న పెద్ద హగరి నదుల కూడలిలో వెలసిన సంగమేశ్వర స్వామి ఉత్సవాలు ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. చోళుల కాలంలో రెండు నదుల కలియు ఒడ్డున ఆలయమును నిర్మించడం వల్ల సంగమేశ్వర ఆలయం అని పేరు పెట్టారని చరిత్రకారులు చెబుతున్నారు. ఈనెల 12న ఉదయం 9 గంటలకు స్వామి విగ్రహాలను సింగేపల్లి గ్రామం నుండి ఊరేగింపు, 10 గంటలకు రుద్రాభిషేకం 11 గంటలకు సంగప్ప సంగమ్మల కళ్యాణం, రాత్రికి సింగేపల్లి నుండి ఉత్సవ సామాగ్రి ఊరేగింపు, 13న తెల్లవారుజామున సంగమేశ్వర స్వామి ఉత్సవం, సాయంత్రం 5 గంటలకు స్వామివారి రథోత్సవం ఉంటాయి.

ఆర్డీటీకి రూ.లక్ష చెక్కు అందజేత..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం/టౌన్ ..ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో పేదలకు సేవ చేయడం నాకు ఎంతో సంతోషంగా ఉందని ఆర్‌డిటి డైరెక్టర్ మాంచో ఫెర్రర్ పేర్కొన్నారు. బుధవారం ఫాదర్ ఫెర్రర్ 105వ జయంతి వేడుకలను ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ బద్దె నాయక్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛంద సంస్థకు రూ.లక్ష చెక్కును బద్దే నాయక్ అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంచో ఫెర్రర్ మాట్లాడుతూ ఫాదర్ ఫెర్రర్ అడుగుజాడల్లో బద్దే నాయక్ నడవడం, నియోజకవర్గంలో వేలాదిమంది పేదలకు సేవ చేయడం చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ పేదల పెన్నిధిగా, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, అనంతపురం జిల్లా పేదరిక జిల్లా అని గుర్తించి పేద ప్రజలకు ఫాదర్ ఫెర్రర్ చేసిన సేవా కార్యక్రమాల స్ఫూర్తితోనే నా వంతు సహచర మిత్రబృందంతో కలిసి సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సురేష్, హరీష్, అబ్దుల్, కంబాల తిమ్మారెడ్డి, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకే శక్తి యాప్ ..

విశాలాంధ్ర-అనంతపురం క్రైం : మహిళలు తమ భద్రత కోసం శక్తి యాప్‌ని ఉపయోగించాలని రూరల్ సిఐ శేఖర్ అన్నారు. స్థానిక సరరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో 'శక్తియాప్'పై బుధవారం అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులలో పోలీస్ తక్షణ సహాయం అవసరమైనప్పుడు యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే క్షణాల్లో సమీపంలోని పోలీసులకు సమాచారం చేరుతుందన్నారు. ఫోన్ లొకేషన్ ఆధారంగా 10 నిమిషాల్లో పోలీసులు బాధితుల వద్దకు చేరుకొని భద్రత కల్పిస్తారన్నారు. మహిళలు ఒంటరి ప్రయాణం సమ యంలో యాప్‌లోని సేఫ్ ట్రావెల్ అను ఆప్షన్‌లోవివరాలు నమోదుచేస్తే కంట్రోల్‌రూమ్ నుండి ట్రాక్ చేయబడుతుందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..

విశాలాంధ్ర-శింగనమల : మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ వెనుకడబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ సహకారంతో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఉచిత కుట్టు శిక్షణా (టైలరింగ్) కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ప్రారంభించారు. ముందుగా ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఉచిత కుట్టు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని. ఇప్పటి రోజుల్లో కుటుంబ పోషణలో మహిళల పాత్ర చాలా కీలకమన్నారు. నియోజకవర్గానికి కూటమి ప్రభుత్వం తరపున 500 కుట్టుమిషన్లు మంజూరయ్యాయని రాబోయే రోజుల్లో మరిన్ని కుట్టుమిషన్లు మంజూరు చేస్తామని తెలిపారు. రోజుకు రెండు బ్యాచుల ప్రకారం మూడు నెలలు శిక్షణ కాలం ఉంటుందని, శిక్షణ కాలంలో 70 శాతం హాజరు ఉన్న వారికి మాత్రమే కుట్టు మిషన్లు అందజేస్తారని వెల్లడించారు.

రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చూడండి : ఎమ్మెల్యే సునీత

విశాలాంధ్ర-రాప్తాడు : రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని తెలుగుదేశం, పరిటాల కుటుంబం అజెండా అభివృద్ధి మాత్రమేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలో రూ.5కోట్లతో రెండు చోట్ల విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి బుధవారం భూమి పూజలు చేశారు. కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామంలో రూ.2.50కోట్ల నిధులతో, రాప్తాడు మండలం హార్మోనీ సిటీ సమీపంలో రూ.2.50కోట్ల నిధులతో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టడంపై ఎమ్మెల్యే సునీతకు స్థానికులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో విద్యుత్ సమస్యలు పెద్ద ఎత్తున తన దృష్టికి వచ్చాయన్నారు. లో ఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెప్పారన్నారు. ఎన్నికల ముందే చాలా చోట్ల సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.. ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వందల్లో ట్రాన్స్ఫర్మర్లు ఇచ్చామని, కండక్టర్, ఇతర మెటీరియల్ తగినంత ఇవ్వలేదన్నారు. దీని వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు జిల్లాలో విద్యుత్ శాఖ ఎస్ఈలు స్పందించి.. రైతులకు సామగ్రి ఇవ్వాలన్నారు. ఇంకా అవసరమైన సబ్ స్టేషన్లను గుర్తించామని, త్వరలో వాటిని కూడా మంజూరు చేయించి నిర్మాణాలు చేపడుతామన్నారు. గత ప్రభుత్వంలో ఎప్పుడైనా రైతుల సమస్యలు పట్టించుకున్నారా అని నిలదీశారు. ప్రజలు మాపై నమ్మకంతో గెలిపించారని.. మేము వారికి జవాబుదారీ తనంగా ఉంటామని తెలిపారు.

58 పెన్సిల్స్‌పై ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆత్మకథ

విశాలాంధ్ర -అనంతపురం : ప్రజలు పెన్సిల్‌తో రాయడం మర్చిపోయిన యుగంలో, ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలోని చిరాల నుండి వచ్చిన 24 ఏళ్ల అన్నం మహిత, పెన్సిల్‌లోని గ్రాఫైట్ లీడ్‌పై అక్షరాలు , బొమ్మలను చెక్కే కళలో ప్రావీణ్యం సంపాదించింది. బుధవారం, గ్రామీణాభివృద్ధి ట్రస్ట్ (ఆర్ డి టి) వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 105వ జయంతి సందర్భంగా, మహిత 58 పెన్సిల్స్‌పై ఫాదర్ ఫెర్రర్ జీవిత చరిత్రను చిత్రీకరించే పెద్ద కళాఖండాన్ని ఆర్ డి టి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నీ ఫెర్రర్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అసియన్ ఫ్రాటెర్నా ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వై. వి. మల్లా రెడ్డి కూడా హాజరయ్యారు. బాలిక ఆలోచనాత్మక కళాఖండాన్ని అభినందిస్తూ, శ్రీమతి ఫెర్రర్ తన చదువును కొనసాగించమని మితను కోరారు.. ఆమెకు అవసరమైన సహాయం అందించారు. "పెన్సిల్ సీసంపై పిన్ సహాయంతో పగలగొట్టకుండా ఇన్ని పదాలను ఎలా చెక్కగలిగావు? అని అన్నీ ఫెర్రర్ ఆ అమ్మాయి ప్రతిభకు ముగ్ధురాలైంది. అనంతపురం ఆర్‌డిటి క్యాంపస్‌లోని ఫాదర్ ఫెర్రర్ మ్యూజియంలో ఈ కళాఖండం చోటు చేసుకుంటుందని శ్రీమతి ఫెర్రర్ పేర్కొన్నారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి ఫాదర్ ఫెర్రర్

విశాలాంధ్ర, శెట్టూరు : ఆర్‌డీటీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ 105 వ జయంతి పురస్కరించుకొని బుధవారం కంబాలపల్లి గ్రామంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఆర్డిటి మహిళా సాధికార సంస్థ డైరెక్టర్ శ్రీమతి విశాల ఫెరర్ ముఖ్య అతిథిగా హాజరై ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదరిక నిర్మూలన, ఆర్థిక లబ్ధి చేకూర్చడం, విద్య వైద్యం నిరుపేద కుటుంబాలకు గృహ నిర్మాణ ఆడిటి పాఠశాల నిర్వహణ ఆర్డిటి సంస్థ ఆశయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ.. ఫాదర్ ఆశయ సాధన కోసం ఆయన చెప్పిన దారిలో నడవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు, ఏటిఎల్, సుశీలమ్మ, దళిత నాయకులు టైగర్ వన్నూరు స్వామి, ఎమ్మెన్ రాయుడు,ఆర్డిటి సిబ్బంది తిమ్మక్క వన్నూరు స్వామి, మహిళ సంఘం లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కూడేరు : మండల వ్యాప్తంగా ఆర్‌డిటి సంస్థ వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు, స్పెయిన్ దేశం నుంచి అనంతపురం జిల్లాకు డాక్టర్ ఇన్సెంట్ ఫెర్రర్ వచ్చి .. ఆర్‌డిటి సంస్థ స్థాపించి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పేదరికంతో కడు దుర్భర జీవితం గడుపుతున్న ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికై మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో స్పందించు సహాయం అందించు హుండీల ప్రోగ్రాం మహిళల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, బుధవారం జయపురం, చోళ సముద్రం గ్రామాలలో స్పందించు సహాయం అందించు అనే కార్యక్రమానికి ఆర్ .డి టి .డైరెక్టర్ నిరంజన్, ఏటీఎల్ నల్లపరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 10, ఏప్రిల్ 2025

చెరువుల అభివృద్ధికి నివేదికలు సిద్ధం చేయండి

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి మంత్రి సత్య కుమార్ యాదవ్

విశాలాంధ్ర-ధర్మవరం : మైనర్ ఇరిగేషన్ శాఖ ద్వారా ధర్మవరం నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధి చేయడానికి ఎంత మేరకు నిధులు అవసరమో నివేదికలు సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ధర్మవరం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నుండి మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ధర్మవరం ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ హాజర య్యారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపరిచే దిశగా ప్రతి శాఖ సక్రమంగా వ్యవహరించా లని సూచించారు. ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమన్వయంతో పనిచేస్తే అన్ని కార్యక్రమాలూ విజయవంతం అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముదిగుబ్బ మండలంలోని యోగి వేమన రిజర్వాయర్ ప్రాజెక్టును సుమారు రూ.60 లక్షలతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 85 చెరువులలో అభివృద్ధి చేయడానికి 96 పనులు ఆమోదించి ప్రభుత్వానికి 179.9 లక్షల రూపాయలు నిధులు అవసరమని నివేదికలు అందజేశా మన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ట్రిబుల్ ఆర్ ద్వారా 21 చెరువుల అభివృద్ధి చేయడానికి 795 లక్షల రూపాయలు అవసరమని కేంద్రానికి నివేదికల సమర్పించా మన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా, పీఏబీఆర్ ద్వారా కాలువల ద్వారా 14 చెరువులు నీరు అందిస్తు న్నామని తెలిపారు. తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం అర్బన్‌లో తీవ్ర నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మవరం మున్సిపాలిటి స్మశానవాటికను హైదరాబాదులో ఉన్న మహాప్రస్థానం లాగా తీర్చిదిద్దడానికి అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలనేది ప్రభుత్వం ఎజెండా అని తెలిపారు.

ఆటో కార్మికులంతా ఏక తాటిపై నిలవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శివేమయ్యయాదవ్.. ఏఐటీయూసీ ఆటో స్టాండ్ ప్రారంభం

విశాలాంధ్ర-కదిరి : పట్టణంలోని ఆటో కార్మికులంద ఏకతాటిపై నిలవాలని ఏఐటియుసి గౌరవాధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం బస్‌స్టాండ్ సమీపంలో భగత్ సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్నం ఆటో స్టాండ్‌ను నూతనంగా ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం.మధు నాయక్, సీపీఐ పట్టణ కార్యదర్శి లియాకత్ అలీ, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కదిరప్ప, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమణ,సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఆ దేప్ప. ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కొత్తపల్లి రోడ్డు సమస్యను పరిష్కరించండి

విశాలాంధ్ర-లేపాక్షి : మండలంలోని కొత్తపల్లి గ్రామం నుండి ప్రధాన రహదారికి కలిసే రోడ్డును వేయాలని ఏఐకెకెఎంఎయస్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం తహసిల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపిడిఓ నరసింహమూర్తికి వినతి పత్రంను అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రంగనాయకులు మాట్లాడుతు కోడి పల్లి పంచాయతీ కొత్తపల్లి, నాగేపల్లి గ్రామాలలో రెండు వేలకు పైగా జనాభా వుందని తెలిపారు. ఈ గ్రామాల నుండి ప్రధాన రహదారికి కలిసే రోడ్డు అస్తవ్యస్తంగా వుందని, అనేక సంవత్సరాల నుండి రోడ్డు సరిగా లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు మొత్తం కంకర వుండడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రజలు, విద్యార్థులు, వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ. తహసిల్దార్ మాట్లాడుతు రోడ్డుకు సంబందించిన సమస్యను సంబందిత అధికారుల దృష్టికి తీసికెళతామని హామీ ఇచ్చారు..

పోలీసులను బట్టలూడదీసి నిలబెడతామనడం బాధాకరం

విశాలాంధ్ర పుట్టపర్తి:-మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రక్షణ కల్పించిన పోలీసులను రోడ్డుపై బట్టలు ఊడదీసి నిలబడతా అనడం బాధాకరమని ఎమ్మెల్యే సింధూరరెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సొంత చెల్లెలు, తల్లికి న్యాయం చేయలేని జగన్ ప్రజలకు ఏమి న్యాయం చేస్తారో చెప్పాలన్నారు. హెలిక్యాప్టర్ మొరాయింపు అని జగన్ పెద్ద డ్రామా ఆడారన్నారు. మెరాయించిన హెలికాప్టర్ బెంగళూ రుకు ఎలా వెళ్ళిందో ప్రజలకు వెల్లడించాలన్నారు. జగన్ పర్యటన కోసం ప్రభుత్వం 5కోట్ల 50 లక్షలు ఖర్చు పెట్టిందన్నారు. లింగమయ్యా కుటుంబానికి నయా పైసా ఇవ్వకుండా చిన్న గ్రామంలో రాజకీయ రంగు పులి మాదున్నారు. ఫ్యాక్షన్‌లేని జిల్లాల్లో మళ్ళీ విధ్వంసం సృష్టించాలన్నదే జగన్ ఉద్దేశ్యం అన్నారు. రెండు కులాల మధ్య చిచ్చు పెట్టడానికే జగన్ జిల్లా పర్యటన నిర్వహించా లన్నారు. జగన్ పర్యటన మొత్తం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత,పరిటాల శ్రీరామ్, రామగిరి ఎస్ఐ లే టార్గెట్ గా ఎంచుకున్నాడు అన్నారు. కనీసం నీ చిన్నాన్న వైయస్ వివేకా హత్యకు గురైతే ముఖ్యమంత్రిగా ఏమి చేశావని చెప్పాలన్నారు. ప్రకృతి వైఫల్యాలు, మహిళలపై జరుగుతున్న దాడులు, మానభంగాలు, కోట్లాది రూపాయల ఆస్తి నష్టం జరిగితే జగన్ ఏనాడు పరామర్శించలేదన్నారు.

11న మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా ..

జయప్రదం చేయండి.. సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి ముసుగు మధు

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 11వ తేదీన మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో హోమ్ నందు, ఏఐటీయూసీ, భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషన్స్, కార్మికుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జింకా చలపతి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 650-2 సర్వే నంబర్ లో జరిగిన అవినీతి అక్రమాలపై అనేకసార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని.. అనర్హులు డూప్లికేట్ పట్టాలు చేయించుకుని కట్టడాలు నిర్మిస్తున్నారు అని తెలిపారు. వారి పట్టాలను వెంటనే తొలగించి నిజమైన ప్లంబర్ కార్మికులకు న్యాయం చేయాలని కలెక్టర్, ఆర్డిఓ, తాసిల్దార్ , మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అయితే ఏ ఒక్క అధికారి స్పందించి ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం దారుణమని తెలిపారు. ఇప్పటికైనా రెవిన్యూ, మున్సిపాలిటీ అధికారులు స్పందించి నిజమైన కార్మికులకు న్యాయం చేయకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులను కలుపుకొని పెద్దఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, బుడగ వెంకట నారాయణ, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సకల రాజ,ప్లంబర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, గోవింద రాజులు, అన్నం లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఆంజనేయులు, తాజ్, రామ సుబ్బయ్య, చిన్న, మసూద్, సురేంద్ర, నాగేంద్ర, దాదా పీర్, రామకృష్ణ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ గ్రీవెన్స్‌కు పోటెత్తిన అర్జీలు

విశాలాంధ్ర-పెనుకొండ : మండలంలోని రాంపురం ,శెట్టిపల్లి, గోనిపేట అడదాకులపల్లి, నాగులూరు మావుటూరు, పంచాయతీల ప్రజల నుండి బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జోలి శాఖ మంత్రి సవితమ్మ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి అర్జీని పీజీఆర్ఎస్‌లో రిజిస్టర్ చేస్తున్నాం.. సమస్యల పరిష్కార ప్రక్రియను తుది వరకు పర్యవేక్షిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఆనంద్ రావు, తాసిల్దార్ శ్రీధర్, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తాం

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల రేషన్ డీలర్లతో మంత్రి సవితమ్మ సమావేశమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి జిల్లా అధికారులతో కలిసి చర్చించారు. డీలర్ల వద్ద బఫర్ స్టాకు ఉందని డీలర్లుకు బియ్యం ఎందుకు తక్కువ ఇస్తున్నారని ప్రశ్నించారు. వాటిని ఎలా తగ్గించాలో చూడాలన్నారు. ప్రతి లబ్ధిదారులకు బియ్యం అందజేయాలని బఫర్ స్టాక్ గురించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డిఎస్ఓ డిఎం సివిల్ సప్లై ఎమ్మార్వోలు సి ఎస్‌డిటిలు స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిలు మండల కూటని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రాష్ట్ర హాకీ పోటీలు నిర్వహిం చారు. నాలుగు రోజులపాటు నిర్వహించిన ఈ హాకీ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా హాకీ క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు.. చివరి రోజున సెమీఫైనల్, ఫైనల్ నిర్వహించారు. సెమీ ఫైనల్‌లో తిరుపతి-కాకినాడ (0-1), అన్నమయ్య-కడప (4-5), కాకినాడ-కడప (2-0), అన్నమయ్య-తిరుపతి (3-1), (సూట్ అవుట్) సెమీఫైనల్ పోటీలు జరిగాయి. తదుపరి ఫైనల్ పోటీల్లో కాకినాడ-కడప (2-0), విన్నర్స్‌గా కాకినాడ, సెకండ్ లో కడప జిల్లా, థర్డ్‌లో అన్నమయ్య జిల్లా కైవసం చేసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొని, హాకీ క్రీడలో గెలుపొందిన వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ హాకీ పోటీలను విజయవంతం చేసిన వారందరికీ కూడా కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హాకీ టర్ఫ్ కోర్టును వీలైనంత త్వరలో ధర్మవరంలో ఏర్పాటు చేస్తారని వారు హామీ ఇచ్చారు. ధర్మారంలో ఏ క్రీడలైనా సరే రాష్ట్ర జాతీయ స్థాయికి వెళుతుండడం నిజంగా నిర్వాహకులు కృషి శ్రమ అని తెలుపుతూ వారిని ప్రత్యేకంగా అభినందిం చారు. ఈ కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు చాణిక్య రాజు, కోశాధికారి తామస్ పీటర్, హాకీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాష్, సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షులు గౌరీ ప్రసాద్, ఉడుగుల రామచంద్ర, ఊకా రాఘవేంద్ర, మహమ్మద్ అస్లాం, ట్రెజరర్ అంజన్న, అరవింద గౌడ్, చందు, డైరెక్టర్లు మారుతీ ప్రసాద్, ఇర్షాద్, అమురుద్దీన్, కిరణ్, జిల్లా హాకీ కోచ్, జిల్లాల హాకీ అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

19న క్రికెట్ లీగ్ టోర్నీ

విశాలాంధ్ర-అగళి : ఈనెల 19, 20వ తేదీల్లో బొమ్మసానిపల్లి క్రికెట్ లీగ్ టోర్నమెంట్ నిర్వహిస్తునట్లు కన్వీనర్‌లు తిప్పేష్ ఆరాధ్యధను తెలిపారు. బొమ్మసానిపల్లి గ్రామంలోని క్రీడా మైదానంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెం ట్‌కు మండలం నుంచి 8 జట్లు పాల్గొంటాయన్నారు. కదిరేపల్లి, (రావుడి) హుల్లేకేరా, రాంపురం, ముక్కడంపల్లి, రాగినింగేనపల్లి, అగళి, నరసం భూది, ఇనగ లూరు, జట్లు పాల్గొంటాయాన్నారు. ఇందులో గెలుపొందిన విజేతలకు బొమ్మసానిపల్లి కురుబ మంజునాథ్ ఎస్‌బిఐ మొదటి బహుమతి రూ. 50 వేలు ట్రోఫిని అందించనుండగా అదే గ్రామానికి చెందిన హరీష్, మహేష్‌లు ద్వితీయ బహుమతి రూ.30 వేలు అందించనున్నారు. రఘుషామియానా, నరసింహరాజు క్రికెట్ కిట్ అందించనున్నారు. విజయ్‌కుమార్ క్రీడాకారులకు అన్నదానం చేయనున్నారు. కన్వీనర్‌లు తిప్పేష్, ఆరాధ్య, ధనుల 9741249043, 99007 72478కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రబాబు రాక

విశాలాంధ్ర పుట్టపర్తి/గోరంట్ల : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రబాబు గురువారం జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆయన అనంతపురంలో పలు అభి వృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనిఅనంతపురం నుండి రోడ్డు మార్గాన్ని బయలుదేరి మధ్యాహ్నం 2.25 నిమిషాలకు గోరంట్ల మండలం పాలసముద్రంకు చేరుకుని ఏపీ ఎస్‌బిసిఎల్ అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ప్రారంభి స్తారన్నారు. మధ్యాహ్నం. 2.25 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నాసిన్ కేంద్రం వద్ద ఉంటారని, సాయంత్రం 4 గంటలకు పాలసముద్రం నుండి బెంగళూరుకు రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి వెళ్తారన్నారు.

రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని వృద్ధుడు మృతి..

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని సిద్ధయ్యగుట్ట సమీపంలో రైల్వే ట్రాక్పై శంకర గోవిందు (70) దాటుతుండగా రైలు ఢీకొని తలకు తీవ్ర గాయం కావడంతో మృతి చెందాడు. హిందూపురం జి అర్ పి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి మాట్లాడుతూ స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి రైల్వే ట్రాక్ పై ఉన్న వ్యక్తిని చూసి 108కు ఫోన్ చేయగా, 108 సిబ్బంది పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారన్నారు. మృతిని కుమారుడు అన్నదమ్ములు శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చ్ రూముకు తరలించారన్నారు. సిద్ధయ్య గుట్టలో ఉన్న తల్లితో మాట్లాడి తిరిగి వచ్చే సమయంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. పోస్టుమార్టర్ అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించారు. అనంతరం హిందూపురం జి ఆర్ పి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘనంగా చిలకం మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ నాయకులు ఘనంగా నిర్వహించు కున్నారు. చిలకం మధుసూదన్ రెడ్డి కేక్ కట్ చేశారు. తదుపరి మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలకు నియోజకవర్గం నుంచి విచ్చేసిన నాయకులకు కార్యకర్తలకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం గొట్లూరు అనాధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. తదుపరి జనసేన నాయకులు సంకు అఖిల్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో అర్చన చేయించి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. డిష్ రాజు ఆధ్వర్యంలో కళాజ్యోతి సర్కిల్ వద్ద కేక్ కట్ చేసి అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని శిరిడి సాయిబాబా దేవాలయంలో కూడా నాయకులు అన్నదానం నిర్వహించి తమ అభిమానాన్ని చాటు కున్నారు. కార్యక్రమంలో అఖిల్ రాయల్, సురేష్, భాస్కర్, నాగలూరు శీన, జి. సాకే వీరు, చంద్ర, బండ్ల చంద్రశేఖర్, విష్ణు, ప్రశాంత్, ఇమ్రాన్, చిరంజీవి, పేరూరు శీనా, పాల్గొన్నారు.

కృత్రిమ కాలు కోసం ఎమ్మెల్యే రూ.5 వేలు సహాయం

విశాలాంధ్ర-అగళి : అగళి మండలం హనుమనపల్లి గ్రామానికి చెందిన పుట్టరాజుకు కృత్రిమ కాలు వేయించుకోవడానికి ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు రూ.5 వేలను జడ్పీటీసీ ఉమేష్ ద్వారా అందించారు. పుట్టరాజు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ డైరెక్టర్లకు సన్మానం

విశాలాంధ్ర-అగళి : మడకశిర నూతన మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ డైరెక్టర్లలశ్రీఱ బుధవారం మడకశిర ఆర్ అండ్ బి బంగాళాలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నియోజకవర్గ ఇంచార్జ్ గుండు మల తిప్పేస్వామి ఘనంగా సన్మానించారు. మడకశిర ఎమ్మెల్యే టీటీడీ పాలక మండలి సభ్యులు ఎంఎస్ రాజు, మడకశిర టీడీపీ ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి మడకశిర ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో నూతన మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, ట్రెడర్స్, నూతనంగా ఎన్నికైన సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి మండల కన్వీనర్లు దాసిరెడ్డి కుమార్ స్వామి, లక్ష్మినారాయణ జడ్పీటీసీ ఉమేష్ పాల్గొన్నారు.

ముదిగుబ్బలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-ముదిగుబ్బ : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర వైద్య విద్య ఆరోగ్యశాఖ మంత్రిసత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముదిగుబ్బ మండలాధ్యక్షులు గొడ్డుమర్రి ఆది నారాయణ యాదవ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నియోజక వర్గంలోని నిరుపేదలకు అందుబాటులో ఉండేటట్లు అనారోగ్యానికి సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అంజన్ రెడ్డి ముదిగుబ్బ వైద్యులు డాక్టర్. రాజేందర్, మెడికల్ క్యాంప్ చెందిన పెద్దలు సంఘమిత్ర గోశాల, డాక్టర్. సాయి తేజా, డాక్టర్.శశి, మండల కూటమి నాయకులు క్రిష్ణ మూర్తి, ఓటీ రెడ్డి, గద్దం మోహన, ముదిగుబ్బ వైద్య బృందం పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు పేదలకు వరం

విశాలాంధ్ర-ధర్మవరం : వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరంలాగా మారుతాయని రెడ్‌క్రాస్ సీనియర్ నాయకుడు డాక్టర్ సత్య నిర్దారన్ తెలిపారు. మంగళవారం ఆర్డిటి విన్సెంట్ ఫెర్రర్ 105వ జయంతి సందర్భంగా ధర్మపురి గ్రామ సచివాలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం డాక్టర్ సత్య నిర్ధారణతో పాటు ముఖ్యఅతిథి ప్రముఖ కవి టీపీ రెడ్డి, సోమల రాజు ఫౌండేషన్ ప్రతినిధి శ్రీధర్ మాట్లాడుతూ వినూత్న ఆలోచన లతో నేడు వృద్ధులకు దివ్యాంగులకు త్రైమాసిక లో ఇవ్వడం శుభదాయకమన్నారు. 30 మంది రోగులకు వైద్య చికిత్సలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆదర్శ దంపతులు జయరామిరెడ్డి, యువర్ ఫౌండేషన్ సభ్యులు కేతా లోకేష్, బ్లడ్ డొనేషన్ యాక్టివిస్టు శ్రీరాములు, సచివాలయ సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు, పాఠశాల హెడ్మాస్టర్ సౌభాగ్య లక్ష్మి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

తాడిమర్రి, విశాలాంధ్ర .. మండుతున్న ఎండల కారణంగా ప్రజల దాహాన్ని తీర్చేందుకు సుప్రమా ఫౌండేషన్ ముందుకొచ్చింది. సంస్థ అధినేత ఎర్ర గంగు వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జూనియర్ కళాశాల వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. గతంలో మండల కేంద్రంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పేరుతో ప్రజలకు 2, రూపాయలకే స్వచ్ఛమైన త్రాగునీటిని అందించారు. అలాగే వివిధ పనుల కోసంప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం సహకరిస్తే మండలంలో పేదరికాన్ని నిర్మూలించే కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించేందుకు ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు ఎర్ర గంగు రఘురాం చౌదరి, ఆదినారాయణ చౌదరి, నాగభూషణం అల్లే భాస్కర్‌రెడ్డి, రాధాకృష్ణ, బాబు, రవీంద్రారెడ్డి, చలపతి, సూర్యనారాయణ, జంపు వెంకటేష్, వెంకటరాముడు, రామచంద్రారెడ్డి, జగదీష్ నారమ్మ వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాలు..నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : ఆర్డీటి సంస్థ వ్యవస్థాపకులు స్వర్గీయ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 105వ జయంతి వేడుకలు బుధవారం మండల కేంద్రం లోని ఆర్డిటి పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఫాదర్ ఫెర్రర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అతి నిరుపేదలు, మానసిక మహిళా వికలాంగులకు నూతన వస్త్రాలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఫాదర్ ఫెర్రర్ పేదల కోసం చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిఓ గీతా, మండల సమైక్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంజెపి కళాశాలను సందర్శించిన ట్రైనింగ్ డీఎస్పి

విశాలాంధ్ర-గుడిబండ : స్థానిక ఎంజేపీ జూనియర్ బాలికల కళాశాలను గురువారం ట్రైనింగ్ డీఎస్పీ పావని సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ జరిపి విద్యార్థి దశ చాలా ముఖ్యమని బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదిగి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. అపరిచిత వ్యక్తులతో మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్,అధ్యాపక బృందం గుడిబండ ఎస్సై రాజకుల్లయప్ప, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పీ డిప్యూటీ సీఈవో ఆకస్మిక పర్యటన



విశాలాంధ్ర-రొళ్ల: మండలంలోని రొళ్ల,గుడ్డగురికి సచివాలయాలను ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న సర్వే పనితీరు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏవో ప్రసాద్ ఇంచార్జ్ ఈ.ఓ.ఆర్.డి బాబురావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనాథ్, శైలజ పరమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర-ఒడిసి రూరల్ : మండల కేంద్రంలోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం వార్షిక స్పోర్ట్స్ మీట్ 2024-2025 కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ జయసింహారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు ఎస్సై మల్లికార్జున్ రెడ్డి, సత్యసాయి జిల్లా స్పోర్ట్స్ ఇన్చార్జి నరసింహ నాయక్‌లు మాట్లాడుతూ శారీరకంగా మానసికంగా ఉల్లాసాన్ని కలిగించడానికి ఆటలు మనిషి జీవితంలో ముఖ్య భాగం అని.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థినీ విద్యార్థులు ఆంగ్ల భాషలో పట్టు సాధించాలని, ఆలోచనను ఆచరణగా మార్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ ఆటలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలతో పాటు ఇంగ్లీష్ గ్రామర్ లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు నగదు బహుమతిని అందించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రాకేష్‌ను ముఖ్య అతిథులు ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ .. ఒకరు మృతి ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర - అగళి : మండల పరిధిలోని వడ గుంటనహళ్లి మలుపు జాతీయ రహదారిలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు డీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఏఎస్ఐ. శ్రీరాములు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాలు.. దొ క్కలపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్ రాకేష్ లు ద్విచక్ర వాహనాంలో వెళ్లుతుండగా ఆంజనేయులు బెంగళూరు నుంచి తమ గ్రామానికి రేషన్ సరుకులు తీసుకోవడానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని వడ్రపాలెం గ్రామానికి చెందిన సి.జి ఆంజనేయులు(42) అక్కడికక్కడే మృతిచెందగా దొక్కల పల్లి గ్రామానికి చెందిన రాకేష్, రంగనాథులకు తీవ్రంగా గాయపడ్డారు. అగళి ఎఎస్ఐ శ్రీరాములు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులను రాకేష్, రంగనాథులను హుటాహుటిన మడకశిర ఆసుపత్రికి, ఆంజనేయులు మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వాసుపత్రికి శవ పరీక్ష నిమిత్తం తరలించినట్లు తెలిపారు. ఏఎస్ఐ శ్రీరాములు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సులో నుంచి కింద పడి మహిళ మృతి

విశాలాంధ్ర-చిలమత్తూరు : మండల పరిధిలోని ఎర్రకొండ అటవీ నర్సరీ సమీపం లో బుధవారం బాలాజీ ప్రైవేట్ బస్సులో నుంచి నేసే ఆదిలక్ష్మమ్మ (58) కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది,. పాత చామల పల్లి గ్రామవాసి ఆదిలక్ష్మమ్మ కుటుంబీకులు 20 సంవత్సరాలుగా ముదిరెడ్డిపల్లిలో నివాసముంటున్నది. ఇటీవలశ్రీరామ నవమి పండగకు ఇంటికి వచ్చిన అక్క బావ ను వారి ఊర్లో వదిలి ముదిరెడ్డిపల్లికి వెళ్లడానికి బాలాజీ ప్రైవేట్ బస్సులో ప్రయాణి స్తుండగా ఎర్రకొండ అటవీ ప్రాంతం నర్సరీ సమీపంలోని మలుపులో బస్సు అతి వేగంగా రావడంతో డోరు ఎదురుగా ఉన్న సీట్లో నుంచి అదుపుతప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది.బస్సు డ్రైవర్ బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నాడు,

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 10, ఏప్రిల్ 2025

పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - గుంతకల్: పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, బుధవారం స్థానిక అజంతా సర్కిల్ లో సిపిఎం పార్టీ పట్టణ కమిటీ, ఐద్వా మహిళా సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కట్టల పొయ్యి మీద వంట చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ మాట్లాడుతూ. సామాన్యులు వాడుకునే వంటగ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం 50 రూపాయలు పెంచడం దారుణమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నా బిజెపి కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడం దుర్మార్గమని తెలిపారు. ఈ పెంపు ఉజ్వల పథకం లబ్ధిదారులకు కూడా వర్తిస్తుందని చెప్పడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు, ఇంటి పన్నులు, పై కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి గ్యాస్ ధరలను తగ్గించే విధంగా చూడాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం పార్టీ మరియు ఐద్వా మహిళా సంఘం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజ్, సురేంద్ర, పట్టణ కమిటీ సభ్యులు రాము నాయక్, లక్ష్మీబాయి, చంద్రశేఖర్, అబ్దుల్లా, మహిళా సంఘం నాయకులు షకీరా, సరస్వతి, లక్ష్మ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరోసారి సామాన్య ప్రజలపై గ్యాస్ ధరలను 50 రూపాయలు పెంచడాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. బుధవారం స్థానిక మైనార్టీ ఆఫీసులో విలేకరుల సమావేశంలో షేక్ అలం సమాజ్ మాట్లాడుతూ సామాన్య ప్రజల పై కేంద్రం ప్రభుత్వం సామాన్య ప్రజల పై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఈ గ్యాస్ ధర పెంపు కేవలం కార్పొరేట్లకు ఊడిగం చేసేందుకు పని కొస్తుందని మండిపడ్డాడు. కార్పొరేట్ కంపెనీలకు లాభాలను చేకూర్చడమే అని అన్నారు. సామాన్య ప్రజనికంపై ఈ విధంగా బారాలు మోపడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు గ్యాస్ ధరలతో పాటు పెట్రోల్, డీజిల్ పై కూడా రెండు రూపాయలు పెంచుతూ ఆదాని,అంబానికి మేలు చేకూర్చే విధంగా ఉందన్నారు ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం గ్యాస్ ధరలను పెట్రోల్, డీజిల్ ధరలను సామాన్య ప్రజలపై భారం మోపకుండా గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి

విశాలాంధ్ర - ధర్మవరం : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ,పెట్రోలు, డీజిల్, ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో స్థానిక కళాజ్యోతి సర్కిల్ నందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు ఎస్ హెచ్ భాష, ఏ.మారుతి,సిఐటియు నాయకులు జెవి రమణ, టి.అయుబ్ ఖాన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం, గ్యాస్ సిలిండర్ల పైన పెంచిన 50 రూపాయలు. (గోరుచుట్టుమీద రోకలిపోటు) అన్నట్లు. బడుగు బలహీన వర్గ ప్రజలు పేదలు మోయలేని విధంగా భారాన్ని పెంచారని మండిపడ్డారు. నిత్యవసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయని, డీజిల్, పెట్రోల్, ధరలు పెంచుతున్నారని, విద్యుత్‌బిల్లులను విపరీతంగా పెంచుతున్నారని, ఒకవైపు పేద బడుగు బలహీన వర్గ ప్రజలు ఉపాధి పనులు లేక వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల జీవన పరిస్థితులు మరింత దిగజారుతున్నాయని, కార్మికులకు. పేదలకు. పనులు లేక ఇబ్బందులు పడుతుంటె వారిని మరింత ఇబ్బందులకు గురి చేసే విధంగా డీజిల్. పెట్రోల్. గ్యాస్ ధరలను, నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మరింత భారాలను మోపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కావున ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధరలను, డీజిల్. పెట్రోల్. ధరలను, విద్యుత్ ధరలను తగ్గించాలని, ఆవిధంగా కాని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పేద ప్రజలను. రైతులను. కార్మికులను కలుపుకొని. పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ప్రభుత్వానికిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలోసిఐటియు నాయకులు ఎల్.ఆదినారాయణ, ఎస్. హైదర్ వలీ, చేనేత కార్మిక సంఘం నాయకులు, గుంపు హరి, వి.వెంకటస్వామి, ఏ. ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రాతిదూలం పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం

విశాలాంధ్ర-తాడిపత్రి : పట్టణంలోని యల్లనూరు రోడ్డు, హరిజనవాడ వద్ద జెసి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బోసి కుటుంబ సభ్యులు సేద్యం ఎద్దుల రాతిదూలం పోటీలు నిర్వహించారు. బుధవారం ఈ పోటీలలో విజేతలు కడప జిల్లా, చాపాడు మండలం, మొరాయపల్లి గ్రామానికి చెందిన చాగం రెడ్డి తేజస్విని రెడ్డి సేద్యం ఎద్దులు రాతిదూలాన్ని 4,416 అడుగుల దూరాన్ని లాగి మొదటి బహుమతి సాధించారు. అనంతపురం జిల్లా, యాడికి మండలం పెద్దపేట గ్రామానికి చెందిన కుర్రపాటి చెన్నారెడ్డి సేద్యం ఎద్దులు రాతిదూలాన్ని 4,315 అడుగుల దూరాన్ని లాగి రెండో బహుమతి, కడప జిల్లా ఎర్రగుంట్ల పట్టణ వాసి బొగ్గుల రామ ఓబుల్‌రెడ్డి సేద్యం ఎద్దులు రాతిదూలాన్ని 4,200 అడుగుల దూరాన్ని లాగి మూడో బహుమతి, ఎల్లనూరు మండలం, 85 నిట్టూరు గ్రామానికి చెందిన వి.రాముడు నాలుగో బహుమతి, కడప జిల్లా లింగాల మండలం చిన్న కుడాల గ్రామానికి చెందిన బద్రి మహేశ్వర్‌రెడ్డి ఐదో విజేతగా నిలిచారు. ఆర్థిక సహాయం అందించిన దాతలు అంగడి సూర్యముని, మద్దిపల్లి గ్రామానికి చెందిన అంకిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, చామల విష్ణువర్ధన్‌రెడ్డి, మంగపట్నం లక్ష్మీనారాయణ, ఇస్మాయిల్ రామ కృష్ణకి బోసి కుటుంబీకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో సీనియర్ టీడీపి నాయకులు మృతి

విశాలాంధ్ర - అగళి : మండలంలోని ఆలుడి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపి నాయకుడు తిమ్మరాజు బుధవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. పార్టీ ఆవిర్భావ నుంచి తిమ్మరాజు పార్టీ బలోపేతానికి కృషి చేసారని అయన లేని లోటు బాధాకరమని టిడిపి సీనియర్ నాయకులు నర్సింహారాజు మాజీ సర్పంచ్ పుట్ట స్వామి రాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ధరలను తగ్గించాలని రాస్తారోక

విశాలాంధ్ర- ముదిగుబ్బ : ఈరోజు కేంద్ర ప్రభుత్వం పెంచినటువంటి గ్యాస్ ధరపై 50 రూపాయలు డీజిల్ పెట్రోల్ పై రెండు రూపాయలు పెంచినందుకు సిపిఎం పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు బుధవారం ముదిగుబ్బ మండల కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్ నుంచి ఆటోను తాడుతోలాక్కుంటూ వెళ్లి, ఎన్టీఆర్ సర్కిల్ నందు సిపిఎం కార్యకర్తలతో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆటో పెద్దన్న సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు ఆవాస్ కమిటీ మండల కార్య దర్శి బాబ్జాన్, రైతు సంఘం మండల కార్యదర్శి పోతలయ్య, నాగప్ప,చాంద్ బాషా,అల్లా బక్షు, చికెను రఫీ, అగ్రహారం సుధాకర, పకీరప్ప, ఆటో కార్మికుల సంకేపల్లి ఆజప్ప, పోతలయ్య సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే వాల్మీకుల అభివృద్ధి

విశాలాంధ్ర- ఉరవకొండ : టీడీపీ అధికారంలో ఉంటేనే వాల్మీకులు అభివృద్ధి చెందుతారని ఉరవకొండ నియోజకవర్గం వాల్మీకి సంఘం నాయకులు తెలిపారు. పట్టణంలో వాల్మీకి కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో 50లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గంలోని వాల్మీకి సంఘంనాయకులు బుధవారం ఉరవకొండలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో వాల్మీకుల అభివృద్ధికి ఎలాంటి కృషి జరగలేదన్నారు. ఉరవకొండ నియోజకవర్గం లో వాల్మీకుల అభివృద్ధికి మంత్రి పయ్యావుల కేశవ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ సీనియర్ నాయకులు దేవినేని పురుషోత్తం, పార్టీ మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ తో పాటు వాల్మీకి సంఘం నాయకులు మరియు మాజీ ఎంపీపీలు అయిన ప్రతాప్ నాయుడు,,బ్రహ్మయ్య సుంకరత్నమ్మ, విడపనకలు జడ్పిటిసి సభ్యులు హనుమంతు, పార్టీ జిల్లా నాయకులు రాయంపల్లి నాగరాజు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మరెన్న, లాయర్ శ్రీనివాసులు, హనుమంతప్ప మాజీ సర్పంచ్ మోపిడి గోవిందు, పెద్ద సంఖ్యలో వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు రథోత్సవ ఆహ్వానం

విశాలాంధ్ర- బొమ్మనహాళ్: బొమ్మనహాల్ మండలం సింగ్డిపల్లి గ్రామా సమీపాన వెలసిన సంగమేశ్వర స్వామి ఉత్సవాలు ఈనెల 12 నుండి ప్రారంభం అవుతున్న విషయం తెలిసిందే అందులో భాగంగా బుధవారం రాయదుర్గం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు కు అనంతపురం కళ్యాణదుర్గం శాసనసభ్యులు దగ్గుబాటి ప్రసాద్ , సురేంద్రబాబు ,టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ , అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, శ్రీధర్ చౌదరి, ప్రతాప్ నాయుడు, రాయంపల్లి నాగరాజు, కొత్తపల్లి తిమ్మరాజు, తదితరులకు సింగేపల్లి తెలుగుదేశం పార్టీ నాయకుడు బొంబాయి ఈర న్న ఆహ్వాన పత్రం అందజేశారు ఈనెల 13 తేదీన సంగమేశ్వర స్వామి రథోత్సవం కు హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ , యూనిట్ ఇన్చార్జి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ధరలు తగ్గించాలని ఆందోళన

విశాలాంధ్ర- ఉరవకొండ : పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ మధుసూదన్ నాయుడు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్య తరగతి వర్గాలపై సిలిండర్ ధరను రూ.50 పెంచి భారం మోపడం సరైంది కాదన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు సిద్ధప్ప, రామాంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం ఓక వరం

విశాలాంధ్ర - పామిడి : పేద బడుగు బలహీన వర్గాల జీవన మృతి కోసం వామపక్షాల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు లోకి తీసుకు వచ్చిన సంగతి తెలిసిందే. కరువు నేపథ్యం వల్ల ప్రతి సంవత్సరం లక్షలాది మందికూలీలు వివిధ ప్రాంతాలకు ఉపాధి కోసం వలసలు వెళ్లిపోతున్నారని, వారికి స్థానికంగా 100 రోజుల పాటు గ్యారంటీగా ఉపాధి కల్పించేందుకు కోసం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం ఉద్దేశం మంచిదే కానీ రాను రాను ఇందులో రాజకీయ ప్రమేయం అధికం కావడంతోపాటు పథకంలో ఉన్న లొసుగులను పసిగట్టి లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారు. ఇది కొందరికి ఆదాయ వనరుగా మారిపోయింది. ఫలితంగా గ్రామాల్లో ఆధిపత్యం వర్గ పోరు చోటు చేసుకుంటున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి సంబంధించి కొందరు కార్యకర్తలు, నాయకులకు ఉపాధి హామీ పథకాన్ని వరంగా మలుచుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే కూలీలు పనులకు రాకున్నా మస్టర్లలో పేర్లు నమోదు చేస్తూ నిధులను కొల్లగొట్టేస్తున్నారు. కొంతమంది మంది కూలీలు పనులకు హాజరైనా,కొంత మంది వచ్చినట్లు చూపుతూ బోగస్ మస్టర్లను సృష్టించి నిధులను మింగేస్తున్నారు. హైదరాబాద్ బెంగళూరు తదితర పట్టణాలలో నివసిస్తున్న వారి పేర్లు కూడా నమోదు అవుతున్నట్లు విశ్వసనీయ సమాచార బుధవారం పామిడి మండలంలో ఖాదర్ పేట, జి కొట్టాల, పామిడి, గజరాంపల్లె, రామగిరి దిగువ తాండ, కత్రిమల పంచాయతీల్లో పనులు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు కొన్ని మస్టర్లు నమోదు చేసి కొంత మంది కూలీలు హాజరైనట్లు ఫొటోలను ఎన్ఎంఎంఎస్ యాప్లో నమోదు చేశారు. ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టుకున్నారు దీనిపై మండల,జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు పట్ల ఎస్సీలు హర్షం

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలో ఎస్సీ (మాదిగ) కులానికి సంబంధించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల రూపాయలు మంజూరు చేయడం పట్ల బుధవారం ఉరవకొండలో తెలుగు దేశం పార్టీ అనుబంధ ఎస్సీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఉరవకొండ నియోజకవర్గం లో దళితుల అభివృద్ధికి రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ చేస్తున్న కృషిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ ఎస్సీ విభాగం సీనియర్ నాయకులు సరస్వతమ్మ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కౌకుంట్ల రవి, ఎస్సీ సెల్ నాయకులు ఎం. వరప్రసాద్, పెద్ద ముష్టూరు రామకృష్ణ, లత్తవరం చంద్ర, వార్డ్ సభ్యుల రామాంజనేయులు, మధు, ఎమ్మార్పీఎస్ నాయకులు గంగాధర్, నారాయణస్వామి, మీసుగా పెద్దన్న దండోరా రమేష్, ఈరన్న, బి.గోపాల్ సుంకన్న, రామకృష్ణ, రవివర్మ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేయాల్సిందే

విశాలాంధ్ర -బొమ్మనహాల్ : ఇళ్ల వద్దనే తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలని అధికారులు నిర్ణయించారు. బుధవారం మండలంలోని దర్గా హొన్నూరు గ్రామంలో ఎంపీడీవో విజయభాస్కర్, ఈఓపిఆర్డి దాస్ తడి చెత్త, పొడి చెత్త పై అవగాహన కల్పించారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి చెత్తగా వేరుపరచి చెత్త సేకరణ సిబ్బందికి ఇవ్వాలని డబ్బాలు పంపిణీ చేశారు. ఈమేరకు కొంతకాలంగా చెత్త సేకరణ సిబ్బంది ఇంటింటా అవగాహన, ప్రచారం కల్పిస్తున్నారని తెలిపారు. చెత్తను కలబోతగా అందిస్తుండడంతో కంపోస్టు యార్డులో చెత్త నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. చెత్తను వేరుపరచి అందివ్వడం ప్రజలు బాధ్యతగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శకుంతలమ్మ , పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్

విశాలాంధ్ర-యాడికి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఫాదర్ ఫెర్రర్ అని పలువురు వక్తలు కొనియాడారు. బుదవారం మండల వ్యాప్తంగా ఫాదర్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.స్థానిక మండల కేంద్రంలోని జడ్పీహెచ్ హైస్కూల్ వద్ద ఉన్న ఫాదర్ విగ్రహానికి స్పెయిన్ దేశస్థులు ఇద్దరు, ఏటీఎల్ లలితా,సి.ఓ ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన స్ఫూర్తి తో విజన్ హైస్కూల్ కరెస్పాండెంట్ విశ్వనాథ్ 10000 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు.

తుమ్మల మారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర -గుడిబండ : మండల కేంద్రంలోని తుమ్మల మారమ్మ దేవి జాతర మహోత్సవం గత మూడు రోజులుగా జరుగుతున్న సందర్భంగా బుధవారం మడకశిర సమన్వయకర్త ఈరలకప్ప,మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి, వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి శివకుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, స్థానిక సర్పంచ్ కరుణాకర్ గౌడ్, ప్రత్యేక పూజలు జరిపించారు ఈ క్రమంలో మహా మంగళహారతి తీర్థ ప్రసాదం ఆలయ అర్చకులు అందజేసి వేదమంత్రలతో శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా వారికి సన్మానించారు, ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాతలింగప్ప వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరియమ్మ దేవి ఉత్సవాల్లో అనంతరాజు

విశాలాంధ్ర -గుడిబండ : గుడిబండ మండలంలోని మద్దనకుంట గ్రామంలో నిర్వహించిన కరియమ్మ దేవి ఉత్సవాల్లో కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు అనంతరాజు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన కరియమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో రొళ్ళ వైకాపా మండల కన్వీనర్ నరసింహారెడ్డి, ఎంపిటిసి రంగనాథ్,కుంచిటి వక్కలిగ సంఘం డైరెక్టర్ కాంతరాజు కొంకల్లు శివకుమార్ పాల్గొన్నారు.అలాగే ఉత్సవాల్లో పాల్గొన్న అతిథులకు సర్పంచ్ జగదాంబ క్రిష్టప్ప విందుభోజనం ఏర్పాటు చేశారు.

అతిథులకు విందు ఏర్పాటుచేసిన సర్పంచ్

విశాలాంధ్ర -గుడిబండ :మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీ తుమ్మల మారెమ్మ ఉత్సవాల్లో మడకశిర వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎంఎల్ఏ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అలాగే సర్పంచ్ కరుణాకర్ గౌడ్ ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, మండలంలోని వైకాపా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గర్భిణీ లకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర -శెట్టూరు : ఏదైనా సమాజానికి సేవ చేయాలన్న ఆలోచన కలగడంతో స్నేహితులందరూ కలిసి ప్రతినెల శెట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామీణ ప్రాంతాల నుంచి గర్భవతులు చికిత్సల కోసం వస్తున్న వారు ఇబ్బందులకు గుర్తించి గర్భవతులకు పోషక ఆహారం పంపిణీ క చేపట్టడం చాలా సంతోషమని డాక్టర్ తరుణ్ సాయి పేర్కొన్నారు బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగ ఉపాధ్యాయులు బద్దే నాయక్, అబ్దుల్ వహాబ్, హాజరై అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గర్భవతుల చికిత్స నిమిత్తం గ్రామీణ ప్రాంతాల నుంచి గర్భవతులు ఓపీ పేషెంట్ ప్రతినెల దాదాపుగా వందమంది దాకా వారందరికీ సంవత్సరం నుంచి మంచి పోషకాలతో కూడిన ఆహారం అందించడం చాలా గొప్ప విషయమని వారు అన్నారు హెల్పింగ్ హాండ్స్ సభ్యులు గత సంవత్సరం ప్రారంభించిన ఈ కార్యక్రమం నేటికీ సంవత్సరం పూర్తి చేసుకోవడం సంతోషకరమని మీ స్నేహితులందరికీ కలిసి ఇలాంటి సేవా కార్యక్రమం చేయడం చాలా గొప్ప విషయం అని వారు కి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమం చేయాలని మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైనవాటిని కూడా సహాయం చేయడానికిముందుంటామని మాకు సహరిస్తున్న ప్రాథమిక ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కమిటీ సభ్యులు లేపాక్షి,బాబు,సుకేష్,సత్యనారాయణ,వీరేష్,నవీన్,మహేష్, బాలరాజ్, రఘు ఆశ వర్కర్లు వివిధ గ్రామాల గర్భవతులు తదితరులు పాల్గొన్నారు

ఆలయ భూమి పూజలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-రొళ్ల: మండల పరిధిలోని ఎల్కేపల్లి వడ్రహట్టి గ్రామంలో బుధవారం శ్రీ ఎల్లమ్మ దేవి దేవస్థానం నిర్మాణానికి గ్రామస్తులు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మడకశిర ఎమ్మెల్యే టీటీడీ పాలకమండలి సభ్యులు ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో దేవాలయం నిర్మించడం,ప్రజలలో భక్తి విధేయత పెంపొందుతుందని తెలిపారు.అనంతరం ఉపాధి హామీ పథకం కింద రైతులకు నిర్మించబడిన,గోకులంషెడ్లును ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. ఏపీడి లక్ష్మీనారాయణ,ఏపీవో ఓబుళప్ప,టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి,మండల కన్వీనర్ దాసిరెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మన్ బి.యస్ గురుమూర్తి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వి.యం పాండురంగప్ప తెదేపా మండల కార్యదర్శి జి.కే ఈరన్న టి.ఎస్.టి.యు.సి జిల్లా ఉపాధ్యక్షుడు బ్యాడగేరి మూర్తి,ఆర్టిఎస్ కోఆర్డినేటర్ రామకృష్ణ,క్లస్టర్ ఇంచార్జ్ భరత్,వైస్ సర్పంచ్ ఎల్కేపల్లి రాజు,మాజీ సర్పంచ్ తిమ్మేగౌడు యూనిట్ ఇంచార్జ్ హేమంత్ కుమార్ మీసేవ వెంకటేష్ ఆసుపత్రి కమిటీ సభ్యులు కాంతరాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ఆర్థిక వితరణ

విశాలాంధ్ర - జెఎన్టియుఏ : అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు వీసెంట్ ఫెర్రర్ జయంతిని పురస్కరించుకొని ఆర్డిటీకీ రూ.1,11,600 ఆర్థిక వితరణను చెక్కును ఆర్డిటీ ప్రతినిధి మల్లికార్జున కి చెక్కు రూపంలో అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ సి. జయచంద్ర రెడ్డి తెలిపారు. ఇంగ్లీష్ అధ్యాపకురాలు జి.రాధిక10,116 రూపాయలు అందజేయగా కళాశాలలోనూ అధ్యాపకులు, విద్యార్థుల సహకారంతో విరాళాలను సేకరించి అందజేశామన్నారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఆర్డిటి నిస్వార్థ సేవ స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తూ ఎందరో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తూ తోడుగా నిలుస్తూ ప్రజల మనలను పొంది స్పందించి సాయం అందించు అనే కార్యక్రమానికి తోడ్పాటును అందించాలని కోరారు.

ఫాదర్ 105వ జయంతి వేడుకలు

విశాలాంధ్ర -గుడిబండ : మండలంలోని ఆర్‌డిటి ఏరియా టీమ్ లీడర్ మీనాక్షి ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఫాదర్ ఫెర్రర్ 105 వ జయంతి ఘనంగా నిర్వహించారు. బుధవారం పూజారిపల్లి మందలపల్లి కొంకల్లు గ్రామాలలో ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ వెనకబడిన వర్గాల కోసం నిరంతరం కృషి చేసేందుకు ఫాదర్ ఫెర్రర్ ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేక మంది నిరుపేదలకు ఉన్నత విద్యకు ప్రోత్సహించారని ఆయన 105వ జయంతి కపోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఆర్డిటి సంస్థ క్లస్టర్ సి ఓ మహేష్, గ్రామస్థాయిలో ఆర్ డి టి సంస్థ సిడిసి నెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల మారమ్మకు ప్రత్యేక పూజలు



విశాలాంధ్ర - గుడిబండ : మండల కేంద్రంలో గత మూడు రోజులుగా శ్రీ తుమ్మల మారమ్మ ఉత్సవాలు జరుగుతున్నాయి. మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాద అందజేసి శాలువా పూల హారలతో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర తెదేపా కార్యదర్శి శ్రీనివాస్ మూర్తిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప మాజీ సర్పంచ్ శ్రీనాథ్ మూర్తి, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, లక్ష్మీనరసప్ప,భీమరాజు మడకశిర ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ కృష్ణమూర్తి, కె.ఎన్.పల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కార్మికుల సమ్మె

విశాలాంధ్ర - కనేకల్ : కనేకల్ గ్రామంలో శ్రీరామ్ రెడ్డి త్రాగునీటి పథకం వాటర్ వర్కర్స్ కార్మికులు 4వరోజు సమ్మె జరుగుతున్న సందర్భంగా కార్మికుల సమస్యలపైన,కనేకల్ మండల తాసిల్దార్ గారికి అంబేద్కర్ సర్కిల్ నుండి ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కనేకల్ నాగరాజు, శ్రీరామ్ రెడ్డి త్రాగునీటి పథకం యూనియన్ జిల్లా సెక్రెటరీ రాము, మండల నాయకులు శివకుమార్, ప్రకాష్ సంజీవప్ప ,రాజశేఖర్, అశోక్, మరియు రాయదుర్గం త్రాగునీటి పథకం కార్మికులు అందరూ పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్ ఫెర్రర్ జయంతి వేడుకలు



విశాలాంధ్ర-ఉరవకొండ : ఆర్డిటి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ 105 వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఉరవకొండలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఫాదర్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జాయింట్ యాక్షన్ కమిటీ సమన్వయకర్త మీనుగ గోపాల్, చైర్మన్ సాకే భాస్కర్ మాట్లాడుతూ పేదల పాలిటి పెన్నిధి ప్రజల గుండెచప్పుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన కృషీవలుడు ఫాదర్ ఫెర్రర్ తన పుట్టిన స్పెయిన్ దేశాన్ని వదిలి ఎక్కడో మారుమూల అనంత జిల్లాకు వచ్చి ఎంతోమంది పేదల యొక్క అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మధు ప్రసాద్, ట్రెజరర్ దుర్గాప్రసాద్, రాజశేఖర్, కో -కన్వీనర్లు పృధ్వి, పురుషోత్తం,లత్తవరంచంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.